## వీరి బర్త్‌డే.. నాలుగేండ్లకోసారే..



సాధారణ సంవత్సరాల కంటే.. నాలుగేండ్లకోసారి వచ్చే లీప్ ఇయర్‌లో ఫిబ్రవరి నెలలో 29 రోజులు ఉండటం విశేషం. ఈ విశేషమైన రోజున రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో చిన్నారులు జన్మించారు. కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పది మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో 9 మంది, సిద్దిపేట జిల్లా గజ్వేల్ దవాఖానలో ఏడుగురు, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో ఒకరు జన్మించారు. సాధారణంగా జన్మించిన అందరూ ఏటా జన్మదిన వేడుకలు చేసుకుంటే.. లీప్ ఇయర్‌లో పుట్టిన వారు మాత్రం నాలుగేండ్లకోసారి ఫిబ్రవరి 29న బర్త్‌డే జరుపుకో వడం నిజంగా వారికోపండుగే. – కరీంనగర్ విద్యానగర్/రామవరం/గజ్వేల్

# కొండగట్టు ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

- నిధుల దుర్వినియోగంపై ఆరా
- ఆపై శాఖాపరమైన చర్యలు

**నమస్తే ఎఫెక్ట్**

మల్యాల, ఫిబ్రవరి 29 : జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయ ఆదాయం దుర్వినియోగం వ్యవహారంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారిని సస్పెండ్ చేసినట్టు ఆలయ ఈవో టంకశాల వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండగట్టు అంజన్న ఆదాయానికి ఓ ఉద్యోగి ఎసరు పెట్టడం, షాపుల లీజుకు సంబంధించి వ్యాపారులు చెల్లించిన రూ.37.90 లక్షలు స్వాహా చేయడం, దానిని ఉన్నతాధికారులు గుర్తించి సదరు ఉద్యోగికి మెమో ఇవ్వడం, ఈ వ్యవహారంపై ఈ నెల 24న 'అంజన్న ఆదాయానికే ఎసరు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో సమగ్ర కథనం ప్రచురితమైంది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. రంగంలోకి దిగి విచారణ జరిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసచారి సరైన లెక్కలు చూపించకపోవడంతో సస్పెండ్ చేశారు. అలాగే అంజన్న ఆలయ ఆదాయం రూ.37.90 లక్షలను సీనియర్ అసిస్టెంట్ సొంతానికి వాడుకొన్నట్టు ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు మల్యాల ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.

# సీడీపీవో అనిశెట్టి శ్రీదేవి అరెస్ట్

**నిధులు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారణ • రిమాండ్‌కు తరలించిన అధికారులు**



హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): మహిళా శిశు సంక్షేమ, అభివృద్ధిశాఖలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి (సీడీపీవో)గా పనిచేస్తున్న అనిశెట్టి శ్రీదేవిని బుధవారం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆమె గతంలో ఆదిలాబాద్ జిల్లా జైనూరు సీడీపీవోగా పనిచేసినప్పుడు నిధులు దుర్వినియోగం చేసినట్టు అధికారులు గుర్తించారు. ఆరోగ్యలక్ష్మి పాల సరఫరా కోసం చేసిన ఖర్చులపై నకిలీ ఇండెంట్లను సృష్టించి నగదు కాజేసినట్టు దర్యాప్తులో తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఆ జిల్లాలో 322 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేసినట్టు దర్యాప్తులో తేలిందని అధికారులు తెలిపారు. మొత్తం రూ.65.78 లక్షల నగదును దారి మళ్లించారని వెల్లడించారు. ఆమెను కరీంనగర్ కోర్టులో హాజరుపర్చిన ఏసీబీ అధికారులు అనంతరం రిమాండ్‌కు తరలించారు.

## డీడీఎన్ అర్చకుల వేతనాలు 11 కోట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 29(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం 6,271 మంది ధూప దీప నైవేద్యం(డీడీఎన్) అర్చకులకు ఫిబ్రవరి, మార్చి నెల గౌరవ వేతనాలు చెల్లించేందుకు రూ.11,01,96,000 నిధులను విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 బడ్జెట్ నుంచి ఈ నిధులను విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నది.

## రోడ్లు, వంతెనల అభివృద్ధికి 800 కోట్లు!

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.800 కోట్లు విడుదల చేయనున్నది. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఎఫ్‌ఐ) కింద ఈ నిధులను విడుదల చేసేందుకు అంగీకరించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడతాయని అధికారవర్గాలు తెలిపాయి. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇటీవల ఢిల్లీలో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై తెలంగాణలో రోడ్లు, వంతెనల అభివృద్ధికి రూ.1,136.58 కోట్లు కేటాయించాలని కోరారు. ఇందులో జిల్లాలవారీగా 28 రోడ్ల అభివృద్ధికి రూ.801.28 కోట్లు, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం తదితర జిల్లాల్లో 8 వంతెనల నిర్మాణానికి మరో రూ.335.30 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు సమర్పించారు.














